సాక్షి
శ్రీకాకుళం
బుధవారం । 27 । మార్చి । 2024




ఆర్మీ జవాన్ల విషాదాంతం

ఇద్దరు ఆర్మీ జవాన్లు వేర్వేరు ఘటనల్లో మృతి చెందారు. ఒకరు రోడ్డు ప్రమాదంలో చనిపోగా మరొకరు సూసైడ్ చేసుకున్నారు. - 8లో




ముందు జాగ్రత్తలతో..

మండు వేసవిని అధిగమించడానికి కలెక్టర్ సూచనలు చేశారు. తాగునీటి కొరత రానివ్వకూడదన్నారు. - 8లో



న్యూస్‌రీల్

'వలంటీర్లపై విషం చిమ్మడం తగదు'


ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: గౌరవ వేతనంతో సేవ చేస్తున్న వలంటీర్లను టెర్రరిస్టులతో పోల్చుతూ శ్రీకాళహస్తి ఎమ్మెల్యే అభ్యర్థి సుధీర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ తీవ్రంగా స్పందించారు. నిస్వార్థంగా సేవలు చేస్తున్న వలంటీర్లపై ఎందుకు ఇంత కక్ష అని ప్రశ్నించారు. గ్రామాల్లో అనేక విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు అండగా ఉంటూ వృద్ధ మహిళలకు, దివ్యాంగులకు ఇంటికి వెళ్లి పింఛన్ అందిస్తున్నందుకు టెర్రరిస్టులని అంటారా నిలదీశారు. కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవ చేసినందుకా అని అన్నారు. సుధీర్ లాంటి వారే టెర్రరిస్టులని, ఉగ్రవాదుల కంటే ప్రమాదకరమైన వ్యక్తులని అన్నారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

4,400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం


స్వాధీనం చేసుకున్న సామగ్రితో ఎస్ఈబీ పోలీసులు

మెళియాపుట్టి: మండలంలోని ఎగువబగడ గ్రామంలో మంగళవారం రెండు సారా తయారీ స్థావరాలపై ఎక్సైజ్ సిబ్బంది దాడులు నిర్వహించారు. పలాస, టెక్కలి ఎస్ఈబీ అధికారులు, డీటీఎఫ్, శ్రీకాకుళం ఇంటెలిజెన్స్ సిబ్బంది సమష్టిగా నిర్వహించిన దాడుల్లో 4400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేశారు. అలాగే 120 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు.

ఆదిత్యుని హుండీ కానుకల లెక్కింపు రేపు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ హుండీ కానుకల లెక్కింపు ప్రక్రియ ఈ నెల 28న ఉదయం 8 గంటల నుంచి ఆలయ అనివెట్టి మండపంలో నిర్వహిస్తున్నట్లుగా ఆలయ ఈఓ ఎస్.చంద్రశేఖర్ తెలియజేశారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఆలయ అధికార సిబ్బంది, అర్చకులు ధర్మకర్తల సమక్షంలో హుండీలను తెరిపించనున్నామని, నిబంధనల ప్రకారం లెక్కింపు ప్రక్రియ నిర్వహిస్తామన్నారు.

'టీడీపీ చేసిన అన్యాయాన్ని జనాలకు వివరిస్తా'


మాట్లాడుతున్న కలమట వెంకటరమణ

కొత్తూరు: పాతపట్నం నియోజవర్గంలో కలమట కుటుంబానికి టీడీపీ చేసిన అన్యాయాన్ని గ్రామాల్లో పర్యటించి ప్రజలకు వివరిస్తానని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ అన్నారు. మండలంలోని మాతల గ్రామంలో నియోజవర్గం క్లస్టర్ యూనిట్ ప్రతినిధులతో ఆయన మంగళవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలమట వెంకటరమణ మాట్లాడుతూ పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన తనను కాదని, ఓ అనామకుడికి సీటు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఈ అన్యాయాన్ని ప్రజలకు వివరించేందుకు గ్రామాల్లో పర్యటించే కార్యక్రమాన్ని త్వరలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

సుధీర్‌రెడ్డి వ్యాఖ్యలు గర్హణీయం



మద్దిలి కాళిదాస్

కవిటి: టీడీపీ నేత బొజ్జల సుధీర్‌రెడ్డి రాష్ట్రంలోని గ్రామ వలంటీర్లపై చేసిన వ్యాఖ్యలు గర్హణీయమని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వలంటీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు మద్దిలి కాళిదాసు అన్నారు. ప్రజలకు మంచి చేస్తున్న వలంటీర్లను ఉగ్రవాదులని, డేటా చోరీ చేస్తున్నారని అనడం బాధాకరమన్నారు. ఈ వ్యాఖ్యల్ని తమ సంఘం తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. వెంటనే ఈ తప్పుడు వ్యాఖ్యలను భేషరతుగా వెనక్కి తీసుకుని వలంటీర్లకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కోవిడ్ సమయంలో వలంటీర్లు ప్రాణాలకు తెగించి పనిచేశారని, ఆ సమయంలో సుధీర్ రెడ్డి హైదరాబాద్‌లో దాక్కున్నారని గుర్తు చేశారు.

● ఇంత చేసినా

జెండా మోతేనా..?

- ఎచ్చెర్ల నియోజకవర్గం దాదాపు బీజేపీకే కేటాయింపు
- కళాపై వ్యతిరేకత, కలిశెట్టిపై అపనమ్మకమే కారణం
- అయోమయంలో ఎచ్చెర్ల టీడీపీ శ్రేణులు



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : ఎచ్చెర్ల టీడీపీలో విచిత్ర పరిస్థితులు చోటుచేసుకున్నాయి. దాదాపు మూడేళ్లుగా ఈ అసెంబ్లీ సీటు కోసం ఇద్దరు నాయకులు పోటీ పడుతుంటే.. పొత్తు పొడుపంటూ చంద్రబాబు మూడో వ్యక్తికి కట్టబెట్టేశారు. దీంతో ఆ ఇద్దరి పరిస్థితి అగమ్యగోచరమైపోయింది. ఇన్నాళ్లూ ఎచ్చెర్ల సీటు తమదంటే తమదేనంటూ పోటీ పడిన సీనియర్ నాయకుడు కళా వెంకటరావు, కలిశెట్టి అప్పలనాయుడు ఇప్పుడు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. వీరిలో కళా వెంకటరావును విజయనగరానికి పంపిస్తున్నారు. కలిశెట్టిని మాత్రం ఇన్నాళ్లూ వాడుకుని ఇప్పుడు గాలికి వదిలేశారు. దీనిపై స్థానికంగా విమర్శలు, అభ్యంతరాలు వస్తున్నా చంద్రబాబు మాత్రం అవేమీ పట్టించుకోవడం లేదు.

ఎందుకొచ్చిన గొడవని..

ఎచ్చెర్ల టీడీపీలో నువ్వానేనా అన్నట్టుగా టిక్కెట్ పోరు ఉండేది. ఒకవైపు సీనియర్ నాయకులు కిమిడి కళా వెంకటరావు, మరోవైపు ఏఎంసీ మాజీ చైర్మన్ కలిశెట్టి అప్పలనాయుడు పోటీ పడ్డారు. ఒకరిపై ఒకరు కత్తులు దూసుకుని ముందుకు సాగారు. అయితే కళా వెంకటరావుకు స్థానికంగా సానుకూలత లేకపోవడం, కలిశెట్టి అప్పలనాయుడు సామర్థ్యంపై పూర్తిస్థాయిలో నమ్మకం లేకపోవడంతో ఎందుకొచ్చిన గొడవ అని పొత్తులో ఈ సీటు బీజేపీకి కేటాయించినట్లు సమాచారం. అందుకు తగ్గట్టుగానే బీజేపీ రంగం సిద్ధం చేసుకోవడమే కాకుండా టీడీపీ ప్రధాన ఆశావహులతో పాటు ఆ పార్టీ కీలక నాయకులను కలుస్తున్నారు.

విజయనగరానికి కళా..

శ్రీకాకుళం జిల్లా నుంచి కళా వెంకటరావును పూర్తిగా పక్కన పెట్టేలా చంద్రబాబు పావులు కదుపుతున్నారు. చీపురుపల్లి నుంచో లేదా గజపతినగరం నుంచో లేదా విజయనగరం ఎంపీగానో పోటీ చేయించేందుకు పరిశీలిస్తున్నారు. తూర్పు కాపు సామాజిక వర్గం నుంచి విజయనగరం జిల్లాలో బలమైన నాయకుడు లేడని చెప్పి కళా వెంకటరావును అక్కడకు బలవంతంగా పంపించే ప్రయత్నం చేస్తున్నారు. అయితే కళా వెంకటరావు ఆసక్తి చూపకపోవడంతో ఆయన అభ్యర్థిత్వం సందిగ్ధంలో పడింది. ఆ జిల్లాలో ఎక్కడకు వెళ్లినా టీడీపీకి క్యాడర్ లేదు. ఏమీ లేనిచోట తానేమి చేస్తానని కళా వెనక్కి తగ్గుతున్నారు. కానీ చంద్రబాబు మనసు కరగడం లేదు.

పొలిటికల్ పాయింట్

రోజుకొక ప్రతిపాదన

ఎచ్చెర్ల బీజేపీకి కేటాయిస్తే కలిశెట్టి అప్పలనాయుడు కూడా గాలిలో ఉండాల్సి వస్తోంది. ఈయనను కాస్త సంతృప్తి పరిచేందుకు, అధిష్టానం దృష్టిలో ఉన్నావని నమ్మకం కలిగించేందుకు విజయనగరం ఎంపీ కోసం కలిశెట్టి అప్పలనాయుడు పేరుతో ఐవీఆర్ఎస్ సర్వే నిర్వహించారు. కలిశెట్టి మాదిరిగానే విజయనగరం జిల్లాలో సీటు దక్కని మాజీ ఎమ్మెల్యే మీసాల గీత, మాజీ ఎంపీపీలు కర్రోతు బంగార్రాజు, కంది చంద్రశేఖర్ పేర్లతో కూడా ఐవీఆర్ఎస్ సర్వే చేస్తున్నారు. ఈ సర్వేలన్నీ కేవలం డ్రామాలేనని ఆ పార్టీ నాయకులకు సైతం తెలుసు. సర్వేల ఆధారంగా కాకుండా డబ్బే ప్రామాణికంగా తీసుకుని, కోట్లిచ్చిన వారికి టిక్కెట్లు ఇస్తున్నారని ఆ పార్టీ నాయకులే బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు.

సానుకూలత ఏదీ..?

ఎచ్చెర్ల సీటును దాదాపు బీజేపీకి కేటాయించడంతో ఆ పార్టీ తరఫున నడికుదిటి ఈశ్వరరావు పోటీ చేయడం ఖాయంగా కనిపిస్తోంది. అధిష్టానం నుంచి సంకేతాలు రావడంతో ఎన్నికల ఏర్పాట్లు చేసుకుంటున్నారు. బీజేపీ, జనసేన నాయకులతో పాటు టీడీపీ నాయకుల వద్దకు ఆశీర్వాదం కోసం వెళ్తున్నారు. తనకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. ఈ క్రమంలో కళా వెంకటరావును సైతం కలిసినట్టు సమాచారం. అయితే, ఆయన్ని నుంచి వ్యతిరేకత ఎదురైనట్టు తెలిసింది. ఎచ్చెర్ల టిక్కెట్ తనకే వస్తుందని, అవసరమైతే చంద్రబాబుతో మాట్లాడుకోవచ్చని ప్రతిస్పందించినట్టు తెలియవచ్చింది. ఇలా ఎక్కే గుమ్మం.. దిగే గుమ్మం అన్నట్టుగా టీడీపీ నాయకుల వద్దకు వెళ్లడమే తప్ప సానుకూలత చూపించడం లేదని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి.

మనోడు అనేనా..?


జిల్లాలో అత్యధిక తూర్పు కాపులున్న నియోజకవర్గాల్లో ఎచ్చెర్ల ఒకటి. ఇక్కడ దాదాపు తూర్పు కాపు సామాజిక వర్గాల వారే దాదాపు బరిలో ఉంటూ వస్తున్నారు. కానీ, తొలిసారి కమ్మ సామాజిక వర్గానికి సీటు కేటాయిస్తున్నారు. బీజేపీ నుంచి రేసులో ఉన్నది మనోడే(నడికుదిటి ఈశ్వరరావు) అని ముందే గ్రహించి వ్యూహాత్మకంగా పొత్తులో భాగంగా బీజేపీకి వదిలేస్తున్నారు. ఈ నిర్ణయం చూసి అటు టీడీపీ, జనసేనతో బీజేపీ శ్రేణులు కూడా ఆశ్చర్యపోయాయి. తూర్పు కాపులు ఎక్కువగా ఉండే నియోజకవర్గంలో కమ్మ సామాజిక వర్గానికి సీటు కేటాయించడమేంటని తప్పు పడుతున్నారు. ఓడిపోయే సీట్లలో ఇదొకటి చేరిందని బాహాటంగానే అనేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ సీటు బీజేపీకి ఇవ్వవద్దని టీడీపీ అధిష్టానానికి ఇక్కడి నుంచి ఫోన్‌లతో పాటు లేఖలు వెళ్తున్నాయి. ప్రధాన ఆశావహులు తమదైన శైలిలో లాబీయింగ్ కూడా చేస్తున్నారు. ఇక్కడి నేతలు కొంతమంది విజయవాడలో తిష్ట వేసి అధిష్టానంపై ఒత్తిడి కూడా చేస్తున్నారు. అయినప్పటికీ చంద్రబాబు స్పందించడం లేదు. చూద్దామనే ధోరణిలో దాట వేస్తూ వస్తున్నారు.

ధర్మాన విజయానికి యాదవులంతా 'సిద్ధం'


మంత్రి ధర్మాన ప్రసాదరావుతో యాదవ కుల పెద్దలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లాలో గల యాదవులంతా మంత్రి ధర్మాన ప్రసాదరావు విజయానికి సిద్ధమని యాదవ సంఘ నాయకులు గద్దిబోయిన కృష్ణయాదవ్ అన్నారు. పెద్దపాడులోగల మంత్రి క్యాంపు కార్యాలయంలో మంగళవారం యాదవ కులానికి చెందిన పెద్దలంతా మంత్రి ధర్మానను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి ధర్మానలను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు తమ కులస్తులంతా కట్టుబడి ఉన్నామన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతి గ్రామంలో యాదవులంతా వైఎస్సార్‌సీపీకి మద్దతి చ్చేలా కృషి చేస్తామన్నారు. మంత్రి ధర్మానను కలిసినవారిలో బూర పాపారావు, పల్ల ఎర్రంనాయుడు, గురు రవియాదవ్, మట్ట గోవిందరావు, పిట్ట రమణ, బాగు దశరథ, పల్ల పెంటయ్య, బొట్టా చందు, కలగ పాపయ్య, మట్ట రమణ, సనగల శ్యామ్, కోటి, పల్ల శ్రీరాములు తదితరులున్నారు.

31తో ధాన్యం కొనుగోలు నిలుపుదల



శ్రీకాకుళం పాతబస్టాండ్: 2023–24 ఏడాదికి సంబంధించి ఖరీఫ్ ధాన్యం కొనుగోలును ఈ నెల 31వ తేదీతో నిలిపివేస్తున్నామని జిల్లా పౌర సరఫరాల కార్పొరేషన్ మేనేజర్ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకూ ధాన్యం విక్రయాలు చేయని రైతులు ఈ నెల 31వ తేదీలోగా సంబంధిత రైతు భరోసా కేంద్రాల ద్వారా విక్రయాలు పూర్తి చేయా లని ఆయన తెలిపారు. గడువు ముగిసిన తర్వాత ధాన్యం కొనుగోలు సాధ్యం కాదని ఆయన పేర్కొన్నారు. ఇప్పటి వరకూ ధాన్యం అమ్మిన రైతులకు మరో మూడు, నాలుగు రోజుల్లో ధాన్యం నగదు, రవాణా చార్జీలు, హమాలీ చార్జీలు బ్యాంక్ ఖాతాలో జమ చేస్తామని తెలిపారు.

ఘనంగా రాజశ్యామల హోమం


- మళ్లీ ఐదేళ్లు వైఎస్ జగన్‌కు అవకాశం ఇవ్వాలి
- కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ సూరిబాబు


రాజశ్యామల హోమం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

శ్రీకాకుళం కల్చరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర విజయవంతం కావాలని కోరుతూ రాజశ్యామల మూలమంత్ర సహిత దుర్గా సంపుటిత హోమం ఘనంగా జరిగింది. నగరంలోని రామలక్ష్మణ కూడలి వద్ద ఉన్న దుర్గామహాలక్ష్మీ దేవాలయంలో రాజశ్యామల మూలమంత్ర సహిత దుర్గా సంపుటిత హోమం ఆలయ ప్రధాన అర్చకులు తెన్నేటి సునీల్ శర్మ నిర్వహణలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు మాట్లాడుతూ ప్రజలకు సీఎం వైఎస్ జగన్ అందించిన సంక్షేమం, అభివృద్ధిని వివరిస్తామన్నారు. మేనిఫెస్టోలోని హామీలను 98.5 శాతం పూర్తి చేసిన ఘనత వైఎస్ జగన్‌కు దక్కుతుందన్నారు. రానున్న ఐదేళ్ల ప్రణాళిక కూడా వివరిస్తామని తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయనున్న లోక్ సభ, శాసన సభ అభ్యర్థులకు ఈ యాగం ద్వారా ఉషస్సు, యశస్సు అందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మార్కెట్ కమిటీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, శ్రీశయన సంఘం కార్పొరేషన్ చైర్మన్ డీపీ దేవ్, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ ఎంవీ పద్మావతి, మాజీ వైస్ చైర్‌పర్సన్ చల్లా అలివేలు మంగ, అంబటి శ్రీనివాసరావు, సుంకరి కృష్ణ, చిట్టి జనార్దన్, కోణార్క్ శ్రీను, పొన్నాడ రుషి, ఎం.తాతబాబు, అంధవరపు సంతోష్, అంధవరపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న టెన్త్ పరీక్షలు

● ఆరో రోజు 723 మంది గైర్హాజరు



శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో జరుగుతున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలు–2024 నేటితో ముగియనున్నాయి. బుధవారం సోషల్ స్టడీస్ పరీక్ష పూర్తి కానుండటంతో ప్రధాన పరీక్షలన్నీ ముగియనున్నాయి. జిల్లా వ్యాప్తంగా 145 కేంద్రాల్లో అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా జరుగుతున్న ఈ పరీక్షల్లో ఆరో రోజు మంగవారం బయలాజికల్ సైన్స్ (జీవశాస్త్రం) పేపర్‌కు విద్యార్థులు పరీక్ష రాశారు. ఉదయం 9.30 నుంచి 11.30 వరకు కొనసాగిన ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 30,007 హాజరుకావాల్సి ఉండగా 29,284 మంది పరీక్ష రాశారు. 723 మంది గైర్హాజరయ్యారు. ఇందులో రెగ్యులర్ విద్యార్థులు 478 మంది, ప్రైవేటు విద్యార్థులు 245 మంది ఉన్నారు.

విస్తృతంగా తనిఖీలు..

పరీక్షలు చివరి దశకు చేరుకోవడంతో అధికారులు తనిఖీలను ముమ్మరం చేశారు. 14 మంది సిట్టింగ్ స్క్వాడ్‌లు 14 కేంద్రాల్లో విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. మొత్తం 10 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, అధికారులు, జిల్లా పరిశీలకులు, అసిస్టెంట్ కమిషనర్ ఆకస్మిక తనిఖీలు చేశారు. ఆరో రోజు మంగళవారం ఎలాంటి మాల్‌ప్రాక్టీసులు నమోదుకాలేదని డీఈఓ కె.వెంకటేశ్వరరావు స్పష్టంచేశారు.

● ఓటు విలువ తెలుసుకో..



ఓటు హక్కు ఆవశ్యకత తెలుపుతూ వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలు ఇలా రంగవల్లులు వేశారు. ఇచ్ఛాపురం మండలం లొద్దపుట్టి ఆర్ హెచ్ కాలనీలో వీఓఏ వి.లత వేసిన రంగవల్లిక చూపరులను ఆకట్టుకుంది. – ఇచ్ఛాపురం రూరల్

● పోలీసుల తనిఖీల్లో రూ.1,37,420 పట్టివేత


తిమ్మాపురం వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్, పోలీసులు

ఆమదాలవలస: ఆమదాలవలస పట్టణ శివార్లలో తిమ్మాపురం జంక్షన్ వద్ద ఎన్నికల విధుల్లో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఇద్దరు వ్యక్తుల నుంచి రూ.1,37,420 పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఆమదాలవలస ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. శ్రీకాకుళం పట్టణం బొందిలీపురానికి చెందిన టి.నాగేంద్రప్రసాద్ హోండా బైక్‌పై పాలకొండ వైపు వెళ్తూ తనతోపాటుగా రూ. 82,820ను ఎలాంటి పత్రాలు లేకుండా తీసుకువెళ్తున్నారు. అలాగే శ్రీకాకుళం ఇలిసిపురానికి చెందిన జి.శ్రీను రూ.54,630 పత్రాలు లేకుండా తీసుకు వెళ్తుండగా ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీ చేసి ఆ మొత్తాన్ని, రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకొని ఆమదాలవలస పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. ఆ మొత్తాన్ని, రెండు వాహనాలను సీజ్ చేసి, దీనికి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

● సోషల్ మీడియా.. తగ్గాలయ్యా



హిరమండలం, ఆమదాలవలస రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బయట కంటే సోషల్ మీడియా వేదికగానే ఎక్కువ యుద్ధాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ పోస్టింగ్‌లపై కూడా అధికారులు దృష్టి సారిస్తున్నారు. ఎవరైనా ద్వేషపూరిత, అసత్య, సమాజంలో అలజడులు రేపే పోస్టింగ్‌లు పెడితే వెంటనే చర్యలు చేపట్టే ఏర్పాట్లు చేశారు. రాజకీయ నాయకులు ఊరూరా తిరుగుతుండడంతో పాటు సామాజిక మాధ్యమాల ద్వారా కూడా ప్రచారం చేస్తున్నారు. ఈ క్రమంలోనే కొన్ని అరాచక శక్తులు విద్వేషాలు రాజేసేందుకు ప్రయత్నిస్తుంటాయి. ఇలాంటి వారిని కట్టడి చేసేందుకు ఎన్నికల కమిషన్ నడుం బిగించింది. సోషల్ మీడియాపై అన్ని శాఖల అధికారుల ద్వారా నిఘా ఉంచింది. ఫొటో మార్ఫింగ్, అశ్లీల చిత్రాలు పంచుకోవడం ఇతరుల మనోభావాలు దెబ్బతినేలా సందేశాలు పంపడం, తదితర కార్యకలాపాలకు పాల్పడితే ఐటీ యాక్ట్ -2000 సెక్షన్–67 కింద కేసు చేస్తారు. నేరం రుజువైతే పదేళ్ల వరకు జైలు శిక్షతో పాటు రూ.2లక్షల జరిమానా విధిస్తారు. సోషల్ మీడియా గ్రూపు సభ్యులు అభ్యంతరకరమైన, వివాదాస్పద పోస్టులు, కామెంట్లు పెట్టినా అడ్మిన్ వెంటనే డిలీట్ చేయాల్సి ఉంటుంది. లేదంటే పోస్టింగ్ చేసిన సభ్యుడితో పాటు గ్రూపు అడ్మిన్ బాధ్యత వహించాల్సి ఉంటుంది.

2024 సమరం సన్నద్ధం

ఫిర్యాదు చేస్తే కేసు..

సామాజిక మాధ్యమాల్లో ఎవరిపైనా వ్యక్తిగతంగా గానీ, పార్టీలపై గానీ అసత్య ప్రచారం చేయకూడదు. పోటీ చేసే అభ్యర్థులపై కార్టూన్, మీమ్స్, షార్ట్ వీడియోల ద్వారా అసత్య ప్రచారం చేసినట్లు ఎవరైనా ఆధారాలతో ఫిర్యాదు చేస్తే వెంటనే పోలీసులు, ఎన్నికల అధికారులు కేసులు నమోదు చేస్తారు. చట్టవిరుద్ధమైన ప్రకటనలు, రాజ్యాంగ ఉల్లంఘన, ఎన్నికల కోడ్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేసినా, ఐపీసీ–504,505 సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తారు. సోషల్ మీడియాలో ఎన్నికల ప్రచార ప్రకటనలకు ముందు జిల్లా, రాష్ట్ర స్థాయిలోని మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ అనుమతి తప్పనిసరిగా పొందాల్సి ఉంటుంది. దీనికి తోడు సోషల్ మీడియా ప్రచారం కూడా పెయిడ్ న్యూస్ కిందకే వస్తుందని స్పష్టం చేశారు.

● ప్రచారాలకు అనుమతులు ఉండాల్సిందే: కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో రాజకీయ నాయకుల ప్రచారాలకు తప్పనిసరిగా అనుమతులు ఉండాలని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ తెలిపారు. అనుమతులు లేకుండా కార్యక్రమాలు చేపడితే ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామని హెచ్చరించారు. జిల్లాలోని రిటర్నింగ్ అధికారులు, ఎంసీసీ అధికారులు, నోడల్ అధికారులు, కంట్రోల్ రూం అధికారులతో ఆయన మంగళవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. లౌడ్ స్పీకర్‌లకు అనుమతులు తప్పనిసరి అని అన్నారు. తాత్కాలిక పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేసినా, ప్రచారానికి వాహనాలు వినియోగించినా, వీధుల్లో సమావేశాలు నిర్వహించినా, సభావేదికలు, బారికేడ్లు ఏర్పాటు చేసినా, అంతర్‌జిల్లాల్లో తిరిగే వాహనాలకు, ఇంటింటా ప్రచారాలకు, ర్యాలీలకు అనుమతులు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఆన్‌లైన్ అనుమతులు 48 గంటల్లో మంజూరు చేస్తామని తెలిపారు. ఆఫ్‌లైన్‌లో సంబంధిత రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేస్తే 24 గంటల్లో అనుమతి వస్తుందని తెలిపారు. రాజకీయ పార్టీలు ఈ సూచనలు పాటించాలని కోరారు.

శ్రీకాకుళంలో జాబ్‌మేళా రేపు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఈనెల 28వ తేదీన జాబ్‌మేళా జరగనుందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ తెలిపారు. నోడల్ రిసోర్స్ సెంటర్, జవహర్ నాలెడ్జ్ సెంటర్, కెమిస్ట్రీ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ జాబ్‌మేళాలో హెటిరో ప్రైవేట్ లిమిటెడ్ ఫార్మా సిటికల్ కంపెనీలో ట్రైనీ కెమిస్ట్ (ప్రొడక్షన్ క్యూసీ, ప్రొడక్షన్ క్యూఏ) ఉద్యోగాల భర్తీ కోసం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అభ్యర్థులు 27 ఏళ్లలోపు వయస్సు కలిగి ఎమ్మెస్సీ ఆర్గానిక్/ఇన్ ఆర్గానిక్/అనలిటికల్ కెమిస్ట్రీ, బీ ఫార్మసీ ఉత్తర్ణులైన పురుషులు, మహిళలు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైనవారికి మంచి జీతంతోపాటు ఈఎస్ఐ, ఈపీఎఫ్, మెడిక్లెయిమ్స్, రిటెన్షన్ బోనస్, సబ్సిడైజ్డ్ ఫుడ్, వసతి, రవాణా సౌకర్యాలు ఉంటాయన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు గురువారం ఉదయం కళాశాల జేకేసీ కేంద్రానికి తమ విద్యార్హత సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలు, రెండు ఫొటోలతో ఉదయం 9.30 గంటలకు హాజరుకావాలని ప్రిన్సిపాల్ సురేఖ కోరారు. మరిన్ని వివరాలకు 9441387184, 9949094968, 8143277610 నంబర్లను సంప్రదించాలని ఆమె సూచించారు.

'జిల్లా అభివృద్ధి వైఎస్ జగన్‌తోనే సాధ్యం'


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యేలు సాయిరాజ్, నరేష్‌కుమార్ అగర్వాలా తదితరులు

కంచిలి,ఇచ్ఛాపురం: జిల్లా అభివృద్ధి వైఎస్ జగన్‌తోనే సాధ్యమని వైఎస్సార్ సీపీ శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ అన్నారు. ఇచ్ఛాపురం పట్టణంలోని రోటరీ ఫంక్షన్ హాల్‌లో మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ అధ్యక్షతన మంగళవారం నియోజకవర్గంలోని నాలుగు మండలాల ముఖ్యనేతలతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. సమావేశంలో పేరాడ తిలక్ మాట్లాడుతూ రానున్న ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. రాష్ట్రంలో ఏ మూలకు వెళ్లినా జగన్నినాదం వినిపిస్తోందని అన్నారు. జిల్లాలో క్లీన్‌స్వీప్ చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. తాము ఐదేళ్లలో చేసిన పనులన్నీ చెప్పుకునే ఓట్లు అడుగుతామని తెలిపారు. కిడ్నీ ఆస్పత్రి, మూలపేట పోర్టు, వైఎస్సార్ సుజలధార వంటి పనులెన్నో ఉన్నాయన్నారు.

జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ మాట్లాడుతూ నియోజకవర్గంలోని నేతలందరి సహకారంతో విజయఢంకా మోగిస్తామన్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో రూ.2600 కోట్ల నిధులతో ఈ ప్రభుత్వం మంచి పనులు చేసిందన్నారు. మీలో ఒకరిగా మీ వెంటే ఉంటూ మీ సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తానని అన్నారు. మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ మాట్లాడుతూ అన్ని పార్టీలు ఏకమైనా ఇచ్ఛాపురంలో గెలిచి తీరుతామన్నారు. స్థానిక టీడీపీ ఎమ్మెల్యే పదేళ్లుగా చేసిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు చింతాడ రవి, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యేలు పిరియా సాయిరాజ్, నరేష్‌కుమార్ అగర్వాలా, సీడాప్ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి స్థానిక నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలకు ఫీజుల స్వీకరణ

ఎచ్చెర్ల క్యాంపస్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ రెండు, నాలుగు సెమిస్టర్ల పరీక్షల ఫీజుల స్వీకరణకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ చెప్పారు. వర్సిటీలో మంగళవారం వివరాలు వెల్లడించారు. ఎటువంటి జరిమానా లేకుండా ఏప్రిల్ 4లోపు దరఖాస్తు చేసుకోవాలని, రూ.500 అదనపు రుసుముతో ఏప్రిల్ 6 వరకు, రూ.1500 అదనపు రుసుంతో ఏప్రిల్ 8 వరకు అవకాశం కల్పించినట్లు చెప్పారు. ఎన్నికల నియమావళి, నిర్వహణ దృష్టిలో పెట్టుకొని పరీక్షల షెడ్యూల్ ఖరారు చేయనున్నట్లు తెలిపారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన


ధర్నా చేస్తున్న యాదవ సామాజిక వర్గం నేతలు


కంచిలి: స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట యాదవ సామాజికవర్గానికి చెందిన నేతలు మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ధర్నా చేపట్టి నిరసన వ్యక్తంచేశారు. వివరాల్లోకి వెళితే.. కవిటి మండలం జి.బెలగాం గ్రామానికి చెందిన మద్దిలి ఈశ్వరరావు పెద్దమనిషిగా వ్యవహరిస్తున్న ఒక కేసు విషయంలో కంచిలి ఎస్ఐ జి.రాజేష్ అకారణంగా చెయ్యి చేసుకున్నారని బాధితుడితో పాటు మద్దతుదారులు ఆరోపించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ తదితరులు మంగళవారం మధ్యాహ్నం కంచిలి పోలీస్‌స్టేషన్ వచ్చారు. పోలీసులతో చర్చలు జరిపిన అనంతరం బాధితుడు ఈశ్వరరావు, ఆయన మద్దతుదారులు శాంతించారు.

రేషన్ డీలర్‌పై విచారణ


టీడీపీ నాయకులతో ఉన్న రేషన్ డీలర్ రాము

కోటబొమ్మాళి: మండలంలోని కొత్తపేట రేషన్ డీలర్ సుంకరి రాముపై కోటబొమ్మాళి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వై.పద్మజ మంగళవారం విచారణ చేపట్టారు. రేషన్‌డీలర్‌గా పనిచేస్తూనే తెలుగుదేశం పార్టీ తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న రాముపై చర్యలు తీసుకోవాలని కొత్తపేటకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు దుక్క రామకృష్ణ, మక్క నారాయణరావు తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. టీడీపీ నాయకులతో కలిసి ఉన్న ఫొటోలను తహశీల్దార్‌కు అందజేశారు. ఎన్నికల అధికారిగా ఉన్న ఎంపీడీఓ ఎచ్చెర్ల పద్మజ రేషన్‌డీలర్, ఫిర్యాదుదారులను పిలిపించి విచారణ చేపట్టారు. నివేదికను టెక్కలి సబ్ కలెక్టర్‌కు అందజేస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

టెక్నికల్ ఫెస్ట్ వెబ్‌సైట్ ప్రారంభం


వెబ్‌సైట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న డైరెక్టర్, అధికారులు, విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయంలో ఏప్రిల్ 13, 14 తేదీల్లో నిర్వహించనున్న టెక్నికల్ ఫెస్ట్‌కు సంబంధించి వెబ్‌సైట్‌ను నూజివీడు క్యాంపస్ నుంచి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎం.విజయ్‌కుమార్ మంగళవారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలు లక్ష్యంగా టెక్నికల్ ఫెస్ట్‌లు జరగాలన్నారు. పూర్తిస్థాయి సాంకేతిక ప్రగతిపై దృష్టి పెట్టేలా విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. స్టార్టప్‌లపై దృష్టి పెట్టి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ జీడీవీడీ బాలాజీ, అధికారులు పాల్గొన్నారు.


పొందూరు: పొందూరులో భవన నిర్మాణ కార్మికుడికి కరపత్రం అందిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం


ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురంలో ఎన్నికల ప్రచార రథంపై అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు పిరియా విజయ, తిలక్


మెళియాపుట్టి: ఉత్తరాంధ్రలోనే ఎత్తయిన గిరిశిఖర గ్రామమైన చందనగిరిలో గిరిజనులతో మమేకమైన పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి


కోటబొమ్మాళి: చిన్నహరిశ్చంద్రపురంలో ఎన్నికల ప్రచార రథం ప్రారంభిస్తున్న టెక్కలి వైఎస్సార్ సీపీ అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్, నాయకులు


వజ్రపుకొత్తూరు రూరల్: బాతుపురంలో ఇంటింటా ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


జి.సిగడాం: బాతువలో వృద్ధులను పలకరిస్తున్న ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ సతీమణి పరిమళ

ప్రచారం.. ముమ్మరం

సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు దూసుకుపోతున్నారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటర్లను పలకరిస్తున్నారు. ఆప్యాయంగా మాట్లాడుతూ కష్టసుఖాలు అడిగి తెలుసుకుంటున్నారు. సంక్షేమ ఫలాలు నిరంతరం కొనసాగేందుకు తమకే ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. – సాక్షి నెట్‌వర్క్

ముందు జాగ్రత్తలతో.. మండువేసవిని అధిగమిద్దాం

- తాగునీటికి కొరత రానివ్వొద్దు
- సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: తాగునీటికి ఎటువంటి కొరత లేకుండా ముందస్తు చర్యలు చేపట్టి మండువేసవిని అధిగమిద్దామని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తాగునీరు, వడదెబ్బ, ముందస్తు చర్యలపై జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో కలిసి జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ముందుగా ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ శ్రీనివాసరావు జిల్లాలోని బోర్లు, పంపులు, రిజర్వాయర్లలో నీటి నిల్వలు తదితర వివరాలు వెల్లడించారు. అనంతరం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండలం స్థాయి అధికారులతో వేసవి ఎద్దడిని అధిగమించేందుకు చేపడుతున్న పనులపై ఆరాతీశారు. సమస్యాత్మక గ్రామాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రానున్న రెండు నెలలు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నందున ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా అవగాహన కల్పించాలన్నారు. బోర్లు పాడైతే వెంటనే బాగు చేయాలని సూచించారు. చలివేంద్రాల ఏర్పాటుకు చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖాధికారి నిశాకుమారి, సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ శ్రీనివాసరావు, జెడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకట్రామన్, డీఎంహెచ్ఓ బి.మీనాక్షి, వంశధార ఎస్ఈ డోల తిరుమలరావు, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ అధికారి కిరణ్‌కుమార్, ఇరిగేషన్ ఎస్ఈ సుధాకర్, డ్వామా పీడీ చిట్టిరాజు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా వైకల్య నిర్ధారణ పరీక్షలు


ఓ బాలుడికి వైకల్య నిర్ధారణ పరీక్షలు చేస్తున్న వైద్యులు, పర్యవేక్షిస్తున్న ఏపీసీ

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రత్యేక అవసరాలు గల పిల్లల వైకల్య నిర్ధారణ పరీక్షలు అత్యంత పారదర్శకంగా జరగాలని సమగ్రశిక్ష ప్రాజెక్ట్ అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ (ఏపీసీ) డాక్టర్ రోణంకి జయప్రకాష్ పేర్కొన్నారు. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉపకరణాలు పంపిణీ చేయాలని ప్రభుత్వం భావించిన నేపథ్యంలో ప్రత్యేక అవసరాల పిల్లలకు వైకల్య నిర్ధారణ పరీక్షల ప్రక్రియ సమగ్రశిక్ష, విద్యాశాఖల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాలో ప్రారంభమైంది. తొలిరోజు శ్రీకాకుళం, ఎల్ఎన్ పేట కేంద్రాలుగా నిర్ధారణ పరీక్షలు మొదలయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సమగ్రశిక్ష ఏపీసీ డాక్టర్ జయప్రకాష్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉపకరణాలను అందజేయాలని ప్రభుత్వం ఆలోచన చేయడం గొప్ప విషయమన్నారు. నిర్ధారణ పరీక్షలను బట్టి ట్రైసైకిల్, వీల్‌చైర్, సీపీచైర్, రోలేటర్, బీటీఈ (వినికిడి పరికరం, కాలిపర్స్) అందజేస్తామన్నారు. స్థానిక కోడిరామ్మూర్తి స్టేడియం సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆడిటోరియం వేదికగా నిర్వహించిన వైకల్య నిర్ధారణ పరీక్షలకు మొత్తం 110 మంది ప్రత్యేక అవసరాలగల పిల్లలు హాజరయ్యారు. శ్రీకాకుళంతోపాటు గార, ఎచ్చెర్ల, లావేరు, రణస్థలం, జి.సిగడాం, పొందూరు, ఆమదాలవలస మండలాలకు చెందిన పిల్లలతోపాటు వారి తల్లిదండ్రులు/సంరక్షకులు హాజరయ్యారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ రమేష్, డాక్టర్ శైలజ, డాక్టర్ షిప్ర, డాక్టర్ రవి, సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారులు, భవిత కేంద్రాల సహిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెవిటమ్మ తల్లి ఆలయంలో చోరీ


చోరీ జరిగిన ఆలయం

సారవకోట: మండలంలోని కుమ్మరిగుంట గ్రామంలో గల శ్రీ చెవిటమ్మ తల్లి ఆలయంలో సోమవారం రాత్రి సుమారు రూ.2లక్షల విలువైన వస్తువులు చోరీకి గురయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చెవిటమ్మతల్లి ఆలయంలో అమ్మవారి విగ్రహం మెడలో ఉన్న శతమానం, కాసులు, పుస్తులు తులమున్నర బంగారం, 7 తులాల వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ఈ ఆలయం గ్రామం మధ్యలో ఉండటంతో ఎప్పుడూ తాళాలు వేయరు. ఆ గ్రామానికి చెందిన సారవకోట కృష్ణవేణి ప్రతి రోజు ఆలయాన్ని కడుగుతుండేవారు. అదేవిధంగా మంగళవారం ఉదయం కూడా ఆమె ఆలయ ఆవరణ కడిగి అనంతరం గుడి తలుపులు తీసి చూడగా అమ్మవారి విగ్రహం మెడలో ఉన్న బంగారు, వెండి వస్తువులు లేకపోవడాన్ని గుర్తించారు. దీని పై గ్రామస్తులకు తెలియజేయగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు యాళ్ల శ్యామసుందరరావు పోలీసులకు సమాచారం అందించారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ అప్పారావు కేసు నమోదు చేశారు. అలాగే అలుదు గ్రామానికి సమీపంలో ఉన్న ఆంజనేయ స్వామి మందిరంలో కూడా ఆదివారం రాత్రి గంట, ఇత్తడి పల్లెం చోరీకి గురైనట్లు అక్కడి వారు తెలిపారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక


పార్టీలో చేరిన వారితో మంత్రి సీదిరి అప్పలరాజు

మందస: మందస పట్టణానికి చెందిన తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో మంగళవారం రాష్ట్ర పశు సంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సమక్షంలో చేరారు. వైస్ ఎంపీపీ సీరప్రసాద్, జేసీఎస్ పలాస నియోజకవర్గ కన్వీనర్ చింతాడ గణపతి ఆధ్వర్యంలో వీరంతా పార్టీ కండువాలు ధరించారు. పార్టీలో చేరిన వారిలో సుజీత్ పట్నాయక్, సంతోష్, శివకుమార్, అభి, నున్ను, సుందరరావు తదితరులు ఉన్నారు.

బార్ అసోసియేషన్ ఎన్నికలు నేడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా న్యాయవాదుల బార్ అసోసియేషన్ ఎన్నికలు(2024–25) బుధవారం జరగనున్నాయి. అధ్యక్ష పదవికి ముగ్గురు అభ్యర్థులు బరిలో ఉన్నారు. ప్రస్తుత ఆపద్ధర్మ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు ఇప్పటికే మూడు సార్లు అధ్యక్షులుగా పనిచేశారు. కూన రాజారావు, కిలారి ఈశ్వరరావు కూడా అధ్యక్ష పదవికి పోటీపడుతున్నారు.

ఆర్మీ జవాన్ల విషాదాంతం

- ఒకరు రోడ్డు ప్రమాదంలో మృతి
- మరొకరు జమ్మూకాశ్మీర్‌లో ఆత్మహత్య
- శోకసంద్రంలో జీడిపుట్టుగ, మోదుగులపుట్టి గ్రామాలు


చైతన్య(ఫైల్)


ఘటనా స్థలంలో విగతజీవిగా చైతన్య

కాశీబుగ్గ : దేశరక్షణలో సేవలందిస్తున్న ఇద్దరు ఆర్మీ జవాన్లు వేర్వేరు కారణాలతో మృత్యువాతపడ్డారు. ఒకరు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి సాయం కోసం వేడుకుంటూ హృదయ విదారకరంగా మృతిచెందగా.. మరొకరు తాను విధులు నిర్వహిస్తున్న చోటే ఆత్మహత్య చేసుకుని ప్రాణాలు విడిచారు. దీంతో ఆయా కుటుంబాలు విషాదంలో మునిగిపోయాయి.

లారీ కింద నలిగిపోయి..

సోంపేట మండలం జీడిపుట్టుగ గ్రామానికి చెందిన చెల్లూరి చైతన్య (28) ఇటీవల సీఆర్‌పీఎఫ్ జవాన్‌గా ఎంపికయ్యాడు. శిక్షణ పూర్తి చేసుకుని సెలవు నిమిత్తం స్వగ్రామానికి వచ్చాడు. పలాసలో ఉంటున్న తన పెద్దమ్మను కలిసి ఆశీర్వాదం తీసుకునేందుకు మంగళవారం బైక్‌పై బయలుదేరాడు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని కోసంగిపురం జాతీయ రహదారి వంతెన దిగువ ప్రాంతానికి వచ్చే సరికి ఇసుక లారీ ఢీకొట్టింది. చక్రాలమధ్య ఇరుక్కుపోవడంతో సగభాగం నుజ్జయిపోయి విలవిల్లాడాడు. తనను రక్షించాలని వేడుకున్నా ఫలితం లేకపోయింది. సమాచారం అందుకున్న 108 అంబులెన్సు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని బాధితుడ్ని పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అధిక మొత్తంలో రక్తాన్ని కోల్పోవడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చైతన్య మృతి చెందాడు. చైతన్య తండ్రి మరణించగా.. తల్లి కష్టపడి ఇద్దరు కుమారులను చదివించింది. మరో సోదరుడు తేజ చదువుతున్నాడు. చైతన్యకు ఉద్యోగం రావడంతో కుటుంబానికి పెద్ద దిక్కుగా మారాడు. ఇంతలోనే విధి కన్నెర్ర చేయడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏం జరిగిందో..


మద్దిల జోగారావు (ఫైల్)

పలాస మండలం టెక్కలిపట్నం పంచాయతీ మోదుగులపుట్టి గ్రామం కొత్తవీధికి చెందిన మద్దిల జోగారావు (40) జమ్మూకాశ్మీర్ రాష్ట్రంలోని ఉదంపూర్ యూనిట్‌లో జేసీఓ కేడర్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి విధి నిర్వహణలో ఉండగా ఆత్మహత్య చేసుకున్నట్లు మంగళవారం ఉదయం కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. జోగారావుకు తండ్రి ఇది వరకే మరణించారు. తల్లి ఆదెమ్మ, భార్య హేమాకుమారి, టెన్త్ చదువుతున్న కుమార్తె చాందిని, ఎనిమిదో తరగతి చదువుతున్న లక్ష్మీవరప్రసాద్‌లు గ్రామంలోనే ఉన్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియడం లేదు. జమ్మూ కాశ్మీర్ నుంచి బుధవారం సాయంత్రానికి మృతదేహం స్వగ్రామానికి చేరుకోనుందని సమాచారం.

విద్యుత్ షాక్‌తో తాపీమేస్త్రీ మృతి


విద్యుత్‌షాక్‌తో మరణించిన తాపీమేస్త్రీ గున్నయ్య

మందస: మందస మండలంలోని చిన్నసువర్ణాపురంలో మంగళవారం జరిగిన విద్యుత్ ప్రమాదంలో సాలీన గున్నయ్య(43) అనే తాపీమేస్త్రీ మృతి చెందారు. ఇంటి పనులు చేస్తుండగా ఇనుప గజానికి విద్యుత్ ప్రసరణ జరిగింది. ఆ గజాన్ని పట్టుకోవడంతో ఆయన షాక్‌కు గురయ్యాడు. వెంటనే స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పలాస 108 అంబులెన్స్ సిబ్బంది బత్తిని తారకేశ్వరరావు, శ్రీనివాస్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని పరీక్షించి ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడు పలాస మండలం మాకన్నపల్లి గ్రామానికి చెందిన వాడు కాగా, కొంతకాలంగా మందస మండలంలోని బహాడపల్లి గ్రామంలో గల అత్తవారింట్లో నివాసం ఉంటున్నారు. ఆయనకు భార్య గంగమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మందస పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని హరిపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

మై డియర్ వెంకటేశం.. నాటకం చూద్దాం రావోయ్

మీరు పుష్పాలు, రాకీభాయ్‌లు చూసుంటారు. రామ్, భీమ్ వంటి క్యారెక్టర్లు తెరపై చూసి విజిల్స్ వేసి ఉంటారు. గిరీశాన్ని ఎప్పుడైనా రంగస్థలంపై చూశారా..? మధురవాణి అందంగా డైలాగులు చెబుతుండగా విన్నారా..? పది పన్నెండు వందలకు కూతుళ్లను అమ్ముకునే అగ్నిహోత్రావధానులు పాత్రను ఎన్నడైనా పరిశీలించారా..? అదే డబ్బుకు బాలికలను కొని పెళ్లాలుగా చేసుకునే లుబ్ధావధానులు అనే ముసలివాడి గురించి ఏనాడైనా తెలుసుకున్నారా..? కన్యాశుల్కం పేరు తప్ప నాటకాన్ని ఎప్పుడైనా చూశారా..? ఇప్పుడు ఆ మహత్తర అవకాశం వచ్చింది. శ్రీకాకుళంలోని బాపూజీ కళామందిర్‌లో నేటి సాయంత్రం ఏడు గంటలకు ఈ నాటకాన్ని ప్రదర్శించనున్నారు. వందేళ్ల నాటి కాలాన్ని మన ముందుంచనున్నారు.

- నేడు శ్రీకాకుళంలో 'కన్యాశుల్కం' నాటిక ప్రదర్శన
- ఏర్పాట్లు చేసిన సుమిత్రా కళా సమితి సభ్యులు
- రూ.50 టికెట్‌తో నాటిక చూసే అవకాశం
- 28 నుంచి జాతీయస్థాయి ఆహ్వాన నాటిక పోటీలు



సుమిత్రా కళాసమితి సభ్యులు ఇటీవల ప్రదర్శించిన కన్యాశుల్కం నాటిక ప్రదర్శనలో ఓ సన్నివేశం

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్రంలోని సుమిత్ర కళాసమితి సభ్యులు ఓ అపూర్వ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ నెల 28 నుంచి జాతీయస్థాయి ఆహ్వాన నాటిక పోటీలు నిర్వహించనున్నారు. అంతకంటే ముందు బుధవారం కన్యాశుల్కం నాటకాన్ని ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేశారు. దీనికి టికెట్ కూడా రూ.50గా నిర్ణయించారు. ఈ నాటకాన్ని 1892లో గురజాడ అప్పారావు రచించారు. ఇప్పటికీ ఆ రచనలోని సొగసును ఆస్వాదిస్తూనే ఉన్నారు. నాటకంలోని ప్రధాన పాత్రలైన గిరీశంగా ప్రధాన విజయరామ్, మధురవాణిగా కేశిరెడ్డి రాజేశ్వరి, బుచ్చెమ్మగా సునీతారాణి, రామప్పంతులుగా రేజేటి బోసు బాబు, వెంకటేశంగా మహేష్ తదితర పాత్రలు మరికొందరు ధరిస్తున్నారు. ఈ నాటకాన్ని దర్శకత్వ బాధ్యతలు ఇప్పిలి శంకరశర్మ నిర్వహిస్తున్నారు.

28 నుంచి నాటిక పోటీలు

ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా జాతీయస్థాయి ఆహ్వాన నాటిక పోటీలు ఈనెల 28నుంచి నిర్వహిస్తున్నారు. 28న కొలకలూరు, సాయిఆర్ట్స్ వారిచే 'కౌసల్యా సుప్రజా రామా' నాటిక, కాకినాడ, సాయి కార్తీక్ క్రియేషన్స్ వారి 'ఎడారిలో వాన చినుకు' నాటికలు ప్రదర్శిస్తున్నారని తెలిపారు. 29న హైదరాబాద్‌కు చెందిన గోవాడా క్రియేషన్స్ వారి 'మూల్యం' నాటిక, కాకినాడ శృంగార వల్లభ ఆర్ట్స్ వారి 'కబ్జా' నాటిక, 30న గుంటూరువారి అభియన ఆర్ట్స్ వారిచే 'ఇంద్రప్రస్థం' నాటిక కొప్పోలుకు చెందిన పండు క్రియేషన్స్ వారిచే 'పక్కంటి మొగుడు' నాటిక ప్రదర్శన జరుగుతాయి.

నాటిక పోటీలు విజయవంతం చేయండి



బాపూజీ కళామందిర్‌లో నిర్వహించే నాటక పోటీలను విజయవంతం చేయాలి. ఆహ్వాన నాటిక పోటీలను ప్రతి ఒక్కరూ తిలకించాలి.
– మండవిల్లి రవి, సుమిత్రా కళాసమితి ఉపాధ్యక్షులు